ప్రజాశక్తి

సోమవారం 18 ఆగస్టు 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ముంచెత్తిన వాన

విశాఖ నగర రోడ్లపై భారీగా చేరిన వర్షపు నీటిలోనే సాగుతున్న ప్రయాణాలు

- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలు ప్రాంతాలు మునక
- చోడవరంలో పిడుగుపాటుకు 30 మూగజీవాలు మృత్యువాత
- ఆరిలోవలో కూలిన ప్రహరీ
- భయాందోళనలో కొండవాలు ప్రాంతాల ప్రజలు
- నేడు అన్ని విద్యాసంస్థలకూ సెలవు

పెదగదిలిలో కూలిన ప్రహరీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, గ్రామీణ ప్రాంత విలేకరులు

ఆదివారం విశాఖ, అనకాపల్లి జిల్లాలను వర్షం ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఆరిలోవ, బిఎన్ఆర్.నగర్, గోపాలపట్నం తదితర కొండవాలు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. చోడవరంలో పిడుగుపాటుకు 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం అన్ని విద్యా సంస్థలకూ విశాఖలో సెలవు ప్రకటించారు.

శని, ఆదివారాలలో కురిసిన భారీ వర్షాలకు వైజాగ్ ఓల్డ్ టౌన్‌లో అనేక పల్లపు ప్రాంతాలు నీటి ముంపునకు గురయ్యాయి. జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్ట్ ఆఫీస్ వరకు ఉన్న మెయిన్ రోడ్డుతో సహా అనేక రోడ్లు జలమయంగా మారాయి. ముఖ్యంగా స్టేడియం రోడ్, రామకృష్ణ థియేటర్ ఉన్న 75 అడుగుల రోడ్డు, పూర్ణా మార్కెట్ మెయిన్ రోడ్డు, ఆర్ఆర్ఎంఆర్ రోడ్డు, వెలంపేట మెయిన్ రోడ్డు, సీహార్స్ జంక్షన్ ప్రాంతాలు, ప్రసాద్ గార్డెన్స్ వంటి ప్రాంతాలు నీటముంపునకు గురయ్యాయి. కొబ్బరితోట, జ్ఞానాపురం కాలనీ, ప్రసాద్ గార్డెన్స్ ప్రాంతాలలో అనేక ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. చావుల మదుం అండర్ బ్రిడ్జి ప్రాంతంలో మోకాలు లోతు నీరు నిలిచిపోవడంతో అన్ని రకాల రాకపోకలు నిలిచిపోయాయి. గంగుల గెడ్డ, ఎర్రిగెడ్డ పొంగి ప్రవహించాయి. అన్ని వీధులలో కాలువలు పొంగి ప్రవహిస్తూ ఉండడంతో, కాలువల్లోని చెత్తాచెదారం రోడ్లపైకి వచ్చి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది.

దుడ్డుపాలెంలో పిడుగుపాటుకు మృతిచెందిన గొర్రెలు

దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఓల్డ్ టౌన్ ప్రాంతంలో నీటి ముంపునకు గురైన ప్రదేశాలను పరిశీలించారు. జ్ఞానాపురం ఎర్రిగెడ్డ పొంగి ప్రవహిస్తున్న పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఎటువంటి పరిస్థితి అయినా ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. యుజిడి, ఇంజినీరింగ్ అధికారులతో పాటు, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు తదితరులు పర్యటనలో ఎమ్మెల్యే వెంట ఉన్నారు. భారీ వర్షాలతో ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని, 986619255, 7093246888, 9441758030 నెంబర్లతో తనను సంప్రదించవచ్చని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రజలకు తెలిపారు.

భారీ వర్షాల కారణంగా సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు మిగతా 2లో..

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

వార్త 3లో..

ఓట్ల చోరీపై దేశవ్యాప్త ఆందోళన

వార్త 2లో..

సమ్మె ఒప్పందాల అమలుకు పోరాటం

వార్త 5లో..

సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

వేదికపై కెఎస్.లక్ష్మణరావు, సూర్యనారాయణ తదితరులు

చరిత్రను వక్రీకరించేందుకే పాఠ్యాంశాల తొలగింపు

అల్లూరి విజ్ఞాన కేంద్రం సదస్సులో వక్తలు వార్త మెయిన్‌లో..

ఇఒఐ పేరుతో ఉక్కు ప్రైవేటీకరణ దారుణం

- రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి
- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఇఒఐ) పేరుతో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం మరోసారి సిద్ధపడటం దారుణమని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. ప్లాంట్‌లోని థర్మల్ పవర్ ప్లాంట్‌లో భాగంగాగల క్యాపిటవ్ పవర్ ప్లాంట్ - 2కు సంబంధించి కాంప్రహెన్సివ్ టెక్నికల్ మేనేజ్మెంట్ అండ్ మెయింటెనెన్స్‌కు ప్రైవేటు సంస్థల నుండి బిడ్లు ఆహ్వానించిందని, ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (వర్క్స్ కాంట్రాక్ట్) పేరున ఈ నెల 16న ఇఒఐ నోటీసు జారీ చేశారని, బిడ్స్ వేయడానికి చివరి తేదీ సెప్టెంబర్ 9, బిడ్స్ ఓపెనింగ్‌కు చివరి తేదీ డిసెంబర్ 10గా నోటీసులో పేర్కొన్నారని తెలిపారు. ప్లాంట్‌లోని మరో 12 విభాగాల్లో ఇఒఐకు నోటిఫికేషన్‌ను ప్లాంట్ యాజమాన్యం ఆదివారం జారీ చేసిందన్నారు. ప్లాంట్‌లోని వివిధ కీలక ఆపరేషన్, మెయింటెనెన్స్ విభాగాలను ముక్కలుగా చేసి బడా ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్రే ఈ ఇఒఐ అని చెప్పారు. ఆఫీసర్లు, పర్మినెంట్ ఉద్యోగులు, పాత కాంట్రాక్టు కార్మికులను, ప్రస్తుతం ప్లాంట్‌లోగల సుమారు 600 మంది చిన్న ప్రైవేటు స్థానిక ఏజెన్సీలను పక్కన పెట్టి కేంద్ర ప్రభుత్వ పెద్దల పలుకుబడిలోని సుమారు 50 ప్రైవేటు ఏజెన్సీలకు ప్లాంట్‌ను కట్టబెట్టాలన్నది కేంద్ర మోడీ ప్రభుత్వ కుట్ర అని జగ్గునాయుడు తెలిపారు. దీని వల్ల ఆఫీసర్లు, పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులు వేల సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోతారన్నారు. పర్మినెంట్ ఉపాధి తగ్గిపోతుందన్నారు. నిర్వాసితులకు ఉద్యోగాలు ఆగమ్య గోచరమవుతాయన్నారు. ప్రైవేటు ఏజెన్సీలు ప్రస్తుత కాంటాక్ట్ కార్మికులను తొలగించి, ఇతర రాష్ట్రాల నుండి కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి పెట్టి, కార్మిక చట్టాలు అమలు చేయకుండా, ఉపాధి భద్రత లేకుండా నిలువు దోపిడీ చేస్తాయని తెలిపారు. ఇది పూర్తిగా స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలన్న కుట్రలో భాగమేనన్నారు. కేంద్ర మోడీ ప్రభుత్వం తక్షణమే ఈఓఐలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విశాఖ ఎంపీ శ్రీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతోపాటు కూటమిలోని ఇతర ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన, కూటమి నేతలు సాధించామని చెప్పిన ఆర్థిక ప్యాకేజీ ప్లాంట్ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి దోహదపడలేదని ఆచరణలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఓల్డ్ టౌన్ ఏరియాలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

ముంచెత్తిన వాన

ప్రకటించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భారీ వర్షాలు సమయంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అన్ని విద్యాసంస్థల హెడ్మాస్టర్లు, ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లు తప్పనిసరిగా కలెక్టర్ ఆదేశాలను పాటించాలని తెలిపారు. గాజువాక, భీమునిపట్నం ప్రాంతాల్లోనూ వర్షం దంచికొట్టింది.

అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని దుడ్డుపాలెం గ్రామంలో పిడుగుపాటుకు 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రూ.మూడు లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత పెంపకందారులు లబోదిబోమన్నారు. ఎడతెరిపిలేని వర్షంతో అనకాపల్లి, యలమంచిలి, గాజువాక తదితర ప్రాంతాలకు పనులకు వెళ్లే గ్రామీణ ప్రాంత కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. బుచ్చయ్యపేటలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వడ్డాది పెద్దేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

రైల్వే స్టేషన్ సమీప ప్రాంతంలో నీటిలోనే సాగుతున్న రాకపోకలు

ఇఒఐ పేరుతో ఉక్కు ప్రైవేటీకరణ దారుణం

తేలిపోయిందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, గాజువాక ఎమ్మెల్యే, విశాఖ ఎంపీ స్టీల్ ప్లాంట్‌పై కపట ప్రేమ ఆపి ప్లాంట్ రక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, ఈవోఐని నిలిపివేయించాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి నియమించాలని కోరారు. ఆఫీసర్లు, పర్మినెంట్, కాంటాక్ట్ కార్మికులపై నిర్బంధం, పనిభారాన్ని ఆపించాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఆఫీసర్లు, పర్మినెంట్, కాంటాక్ట్ కార్మికులు, విశాఖ ప్రజలు కేంద్ర కుట్రలను నిలువరించేందుకు ఆందోళనను ఉధృతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైసిపి పంచాయతీరాజ్ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా బొబ్బిలి లక్ష్మణ్

ప్రజాశక్తి - జికెవీధి: వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా జికె వీధి మాజీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్‌ను ఎన్నుకున్నట్టు వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా బొబ్బిలి లక్ష్మణ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా వైసిపి అధ్యక్షులు స్థానిక శాసనసభ్యులు మత్స్యారస విశ్వేశ్వరరాజుకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఓట్ల చోరీపై దేశవ్యాప్త ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బీహార్‌తో సహా పలు రాష్ట్రాల్లో లక్షలాది ఓట్లు ఓటర్ల జాబితాల్లో లేకుండా చేసిన చర్యను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విస్తృత పోరాటం నిర్వహించడం జరుగుతుందని సిడబ్ల్యూసి సభ్యుడు, పిసిసి మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తెలిపారు. ఆదివారం కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై ఓట్‌చోర్ గద్దిచోడ్ అనే నినాదంతో ప్రజల ముందుకు వచ్చామన్నారు. విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్డాల వెంకటవర్మరాజు మాట్లాడుతూ తమ నాయకుడు రాహుల్ గాంధీ మొదలుపెట్టిన ఈ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిసిసి ఉపాధ్యక్షుడు వేగి వెంకటేష్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు, సమన్వయకర్తలు కె.వి సూర్యనారాయణ, దండి ప్రియాంక, సీనియర్ నాయకులు మహమ్మద్ అలీఖాన్,రజియా బేగం కస్తూరి వెంకటరావు, భాషా, పద్మిని, చంద్రశేఖర్, సబ్బవరపు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్టాప్ ఓట్ చోరీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిడుగు రుద్రరాజు తదితరులు

ఎర్రిగెడ్డలో వ్యర్థాలను వెలికి తీయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో విపరీతంగా వర్షాలు కురుస్తున్న సందర్భంగా ఎర్రిగెడ్డలో వ్యర్థాలు ఎక్కువగా చేరుతాయని, వెంటనే వాటిని తొలగించేలా నిరంతరం వెలికితేత పనులు చేపట్టాలని, నగరంలో వర్షాల కారణంగా ఏర్పడుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆదివారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోగల సిటీ ఆపరేషన్స్ సెంటర్‌ను, అలాగే ఎర్రిగెడ్డలో వ్యర్థాలను వెలికి తీసే పనులను స్వయంగా పరిశీలించారు. విశాఖ నగరంలో నిరంతరం కురుస్తున్న వర్షాలు కారణంగా కొండవాలు, లోతట్టు, మురికివాడ ప్రాంతాల్లో, పలు కాలనీలలో ఏర్పడుతున్న సమస్యలపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల సిటీ ఆపరేషన్స్ సెంటర్ నందు స్వయంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నిర్వాహకులను ఆరా తీశారు. వర్షాల కారణంగా 41 ప్రజా ఫిర్యాదులు సిటీ ఆపరేషన్ సెంటర్‌కి అందగా వాటిని సంబంధిత జోనల్ అధికారులకు సమాచారం అందించామని, ఇప్పటికే 37 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. అనంతరం జోన్- 5లోగల 41 వార్డులో నున్న ఎర్రిగెడ్డలో వర్షాలకు అధికంగా వస్తున్న వ్యర్థాలను జెసిబి యంత్రాలతో వెలికి తీస్తున్న పనులను స్వయంగా పరిశీలించారు. ఎర్రిగెడ్డలో ఉన్న మూడు స్క్రీన్‌ల పనితీరును పరిశీలించి స్క్రీన్ల మధ్య ఎక్కువగా ఖాళీలు ఉన్నందున వాటి మధ్య ఎంఎస్.స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలని, యంత్రాల పనివేళలను అడిగి తెలుసుకుని వర్షాల కారణంగా అధికంగా వ్యర్థాలు వస్తాయని అందుకు సిద్ధంగా సంబంధిత సిబ్బంది, యంత్రాలు నిరంతరం విధులు నిర్వహించాలని పర్యవేక్షక ఇంజనీర్ సంపత్ కుమార్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్ పద్మావతి, అసిస్టెంట్ ఇంజినీర్ సతీష్, ఎమినిటీస్ కార్యదర్శి గౌతమ్, గుత్తేదారు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెడ్డల్లో పరిస్థితిని ఆపరేషన్ సెంటర్ నుంచి తెలుసుకుంటున్న కమిషనర్

19, 20న వైజాగ్ ఫొటో జర్నలిస్టుల ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : వైజాగ్‌ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19,20 తేదీల్లో నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.రామకృష్ణ, ఎండి నవాజ్ తెలిపారు. బీచ్ రోడ్‌లో విశాఖ మ్యూజియంలో ఈనెల 19న ఉదయం 10 గంటలకు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని రెండు రోజుల ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ హాజరై ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారన్నారు. వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిఏటా విశాఖ మ్యూజియం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత ప్రవేశం కల్పించామని, ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని కోరారు.

బాబును విమర్శించే అర్హత కల్యాణికి లేదు

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : వరుదు కళ్యాణికి ముఖ్యమంత్రి చంద్రబాబుని విమర్శించే స్థాయి లేదని జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు స్త్రీ శక్తి పథకంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని, స్త్రీ శక్తి పథకంలో ప్రకటించిన 5 బస్సుల్లో మాతో పాటు వస్తే మీకు ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకెళ్తామని ఎద్దేవా చేశారు. వరుదు కల్యాణి మాటలు వెనక్కి తీసుకోవాలని, కూటమి ప్రభుత్వానికి, సీఎంకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గణగళ్ళ సత్యవతి మాట్లాడుతూ మహిళలపై దాడులు చేసింది వైసిపి ప్రభుత్వం ఈ రోజు విమర్శలు చేస్తున్న వైసిపి మహిళలు కాస్త వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. దక్షిణ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కేదారి లక్ష్మి, గొలగాని సౌజన్య , రామలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అనంతలక్ష్మి

IN THE HONOURABLE COURT OF THE Vth ADDL. JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
OS 161/2024

Between:
CANARA BANK, RK Puram Branch, Visakhapatnam rep. by its Manager ... Plaintiff

And:
1) M/s. V K Enterprises, Rep. by its proprietress, Smt. Rongali Varalakshmi
2) Smt. Rongali Varalakshmi W/o. Sri. Rongali Vamsi Krishna ... Defendants

To,
1st Defendant:
M/s. V K Enterprises
Prop. Smt. Rongali Varalakshmi,
D.No.71-31-107/21,G A Colony,
Malkapuram, Visakhapatnam-530011

2nd Defendant:
Smt. Rongali Varalakshmi,
D.No. 3-66/52/4, Flat No. 507,
IV Floor, Sri Sai Vayuputra Residency,
Bakkannapalem, Near St. Anne School, Visakhapatnam-530048

NOTICE
Take notice that the above named Plaintiff instituted the above suit against you under Order VII Rule (1) read with section 26 of the Civil Procedure Code for a Suit claim. You are hereby summoned to appear in the above Court in person or by Pleader duly instructed and able to answer all material questions relating to the above suit on the day **12-09-2025 at 10.30 A M.** Take notice that in default of your appearance on that day and hour, the suit will be heard and determined in your absence basing on the material available in the Court.

G.V.S.PURUSHOTHAMARAO
ADVOCATE,
FLAT NO. 203, GANNI RESIDENCY
ABIDNAGAR, VISAKHAPATNAM-16

మహాజరాశ్రీ కాకినాడ 3వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
Review Petition IA No.223/2023 in HMOP No.320/2020

యర్రమిల్లి సత్య వెంకట కామేశ్వరి **...పిటిషనర్**
మరియు
యర్రమిల్లి వెంకట సత్య శ్యామ్ సుందర్ S/o.వరప్రసాదరావు, ప్లాట్ నెం.3A భేతల్ ఎన్‌క్లేవ్, టెంపనీ స్కూల్ A గేటు ఎదురుగా C.B.M. కాంపౌండు, ఆధార్‌నెం.5345 1722 6172, సెల్.9908115999 విశాఖపట్నం **...రెస్పాండెంటు**

పై నెంబరు పిటిషనర్, పై **HMOP No.320/2020** నపై కోర్టు వారు **14-10-2022**న ఇచ్చిన డిక్రిని రివ్యూ చేయమని దాఖలు చేసిన పిటిషన్‌లో పై నెంబరు రెస్పాండెంటుకు అభ్యంతరములు ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట **ది.29-08-2025**సం॥ తేదిన ఉదయం **10.30ని॥లకు** హాజరుఅయ్యి అభ్యంతరములు ఉన్నయెడల తెలియ పరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మా నింపబడును.

జి.మోహన మురళి
న్యాయవాది,మేడూరి వారి వీది,జి-3
రామారావుపేట,డోనెం.10-3-11
కాకినాడ,సెల్.9299999744

కొనసాగుతున్న భవన నిర్మాణం

పాలిటెక్నిక్ కళాశాల అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు

నిధుల లేమితో మధ్యలో నిలిచిన భవన నిర్మాణం

ప్రజాశక్తి -భీమునిపట్నం : నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఏ) గుర్తింపు పొందిన అత్యున్నత ప్రమాణాలు కలిగి, రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉన్న స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణం నిధుల లేమితో అసంపూర్తిగా ఉంది. సివిల్ ఇంజినీరింగ్ (సిఇ), కంప్యూటర్ ఇంజినీరింగ్ (సిఎంఇ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇసిఇ), కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ (సిసిపి) గ్రూపులతో కొనసాగుతున్న ఈ కళాశాలలో 650 మంది విద్యార్థినులు ఉన్నారు. ఆ 650 మంది విద్యార్థినుల్లో 350 మంది హాస్టల్‌లో (స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్) ఉంటున్నారు.

అదనపు నిధుల కోసం...

ఎపి ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపిఇడబ్ల్యుఐడిసి) ఆధ్వర్యాన 2,277.53 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 8 తరగతి గదులు, 12 ప్రయోగశాలలుకు సంబంధించిన అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను నిర్మిస్తున్నారు. 'ఎ' బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణం పూర్తవ్వగా, 'బి' బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తవ్వగా, నిధులు చాలక ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. ఇందుకోసం అదనంగా రూ.2.90 కోట్లు అవసరమని ఎపి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. 2018 లో ఆర్‌ఐడిఎఫ్ నిధులు రూ.12 కోట్లు మంజూరవ్వగా, 2021 అక్టోబర్ 4న కళాశాల అడ్మినిస్ట్రేటివ్ భవన నిర్మాణ పనులకు అప్పటి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. నిధుల విడుదలలో జాప్యం కారణంగా 2021లో శంకుస్థాపన చేసి నాలుగేళ్ల పైబడినా సరే భవన నిర్మాణం పూర్తి కాలేదు. మంజూరైన నిధులు రూ.12 కోట్లలోనే రూ.70 లక్షలతో ఇప్పటికే ఫర్నిచర్ కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచారు. జిఎస్‌టి, పిఎస్, ఎన్ఏసి, సెస్, సీనరైజ్, క్వాలిటీ కంట్రోల్ కలిపి 26.51 శాతం అంటే దాదాపు రూ.3కోట్లు మంజూరైన నిధుల్లోనే ప్రభుత్వానికి చెల్లించాలి.

నేరాలు ఘోరాలు

గాయపడిన లక్ష్మి

గాయపడిన శిరీష

సిలిండర్ పేలి ముగ్గురికి గాయాలు

ముల్లేటి కృష్ణ

ప్రజాశక్తి -గాజువాక : కొత్తగాజువాకలో ఆదివారం సిలిండర్ పేలి ముగ్గురికి గాయాలయ్యాయి. కొత్త గాజువాకలో నివసిస్తున్న ముల్లేటి కృష్ణ ఆదివారం పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌కు గ్యాస్‌ను ఫిల్లింగ్ చేస్తుండగా, ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి పేలింది. దీంతో ఆయనతో పాటు అక్కడే ఉన్న భార్య లక్ష్మి, పాప శిరీషకు గాయాలయ్యాయి. ప్రస్తుతం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలానికి సిఐ పార్థసారథి చేరుకొని వివరాలను సేకరించారు. మరిన్ని వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి వాంబే కాలనీలో ఆదివారం 50 మంది వృద్ధులకు జీసెస్ మిరకిల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు లక్ష్మీనారాయణ పట్నాయక్ మాట్లాడుతూ, ఏటా తమ సంస్థ తరుపున కొందరికి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ లక్ష్మీపట్నాయక్, సంఘ సభ్యులు సువర్ణరాజు, రాము, శాంతి, దీనా, ఉమ, మెర్సీ, జెస్సీనిసీ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం

- మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జివిఎంసి సంసిద్ధంగా ఉందని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఇప్పటికే అప్రమత్తంతో ముందస్తుగా ప్రత్యేక చర్యలను చేపట్టినట్లు తెలిపారు. కొండవాలు, లోతట్టు, మురికివాడ ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించే దిశగా నగరంలో గల పటిష్టమైన సామాజిక భవనాలు, పాఠశాల భవనాలను అత్యవసర ఆశ్రయాలుగా సిద్ధం చేసినట్లు చెప్పారు. నగరంలో డ్రైనేజీ లైన్లు, మ్యాన్ హోల్స్ , అధికంగా నీరు పారే ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా, వర్షాల కారణంగా దెబ్బతిన్న వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయడం, కూలిన, విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండేందుకు జివిఎంసి వాహనాలను, జనరేటర్లలను, చెట్లను తొలగించే యంత్రాలను, జెసిబిలను, ట్రక్కులను, ఇంధనాలను, సమాచార రేడియో హ్యాండ్ సెట్లు తదితర అవసరమైన పరికరాలను సిద్ధం చేయాలని, జోనల్, సచివాలయ పరిధిలో గల అధికారులను, ఉద్యోగులను, సిబ్బందిని రక్షణ చర్యలు దిశగా సిద్ధంగా ఉండాలని జివిఎంసి అధికారులకు, ఇంజినీర్లకు, జోనల్ కమిషనర్లకు కమిషనర్ ఇప్పటికే ఆదేశాలు జారీ జారీ చేశారని తెలిపారు.

అత్యవసర సహాయ కేంద్రంగా జివిఎంసి ప్రధాన కార్యాలయంలో గల సిటీ ఆపరేషన్స్ సెంటర్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0009ను సంప్రదించాలని సూచించారు. సమీపంలోని జోనల్ కార్యాలయాల్లోనూ సంప్రదించవచ్చని పేర్కొన్నారు. జివిఎంసి అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజలకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై చర్యకు దళితుల డిమాండ్

ప్రజాశక్తి -తగరపువలస : శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళితులు భీమిలి మండలం తాళ్లవలసలో ఆదివారం నిరసన తెలిపారు. తాళ్లవలసలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు బోని సన్యిబాబు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే రవికుమార్ అతని సామాజిక వర్గానికి చెందిన మహిళను పొందూరు కెజిబివిలో ప్రిన్సిపల్‌గా నియమించుకునేందుకు దళిత మహిళా ప్రిన్సిపల్ సౌమ్యను వేధింపులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సౌమ్యపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పొందూరు మండలం నుంచి కంచిలి మండలానికి బదిలీ చేయడం సమంజసం కాదన్నారు. ప్రిన్సిపల్ సౌమ్యను యథావిధిగా పొందూరు కెజిబివిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఎస్.రాంబాబు, వై.రామారావు, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ విశాఖపట్నం జిల్లా కమిటీ ఆదేశాల మేరకు కంచరపాలెం జోన్‌లో ఈ నెల 15వ తేదీన విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ ప్రెసిడెంట్ తరుణ్, సాయి తేజ, నాని, కుమార్, హాస్టల్ వార్డెన్, పిటి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నాయకులు

సమస్యల పరిష్కారానికి లోకేష్ హామీ

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మంత్రి లోకేష్ తో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గ పరిధిలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు రాష్ట్ర ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంత్రి లోకేష్‌ను ఉండవల్లిలో శనివారం కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తగరపువలసలో ఆర్‌టిసి బస్ కాంప్లెక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, చిల్లపేట పెద్ద చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని, ఆనందపురం మండలంలో 100 ఎకరాల్లో మహిళలకు ప్రత్యేక ఎస్ఇజెడ్ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా కృషి చేయాలని, ఇదే మండల కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో మార్కెట్ నిర్మించి, పూల మార్కెట్‌ను తరలించాలని లోకేష్‌ను కోరినట్లు పేర్కొన్నారు. పద్మనాభం మండలంలో 13 కిలోమీటర్ల ఐనాడ, రేవిడి మెయిన్ రోడ్డును తక్షణమే పునరుద్ధరించాలని, పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల్లోని 7గ్రామాల్లో 3 వేల ఎకరాల ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. పద్మనాభం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మధురవాడలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకు మంత్రి లోకేష్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గంటా తెలిపారు. విశాఖ నగరంలోని ఎంవిపి కాలనీ, సాగర్‌నగర్ తరహాలో భోగాపురం, భీమిలి మధ్యలో అత్యాధునిక సౌకర్యాలతో ఒక శాటిలైట్ టౌన్ షిప్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని కోరినట్లు వివరించారు. టిడిపి అధికారంలో ఉండగా ఎండాడలోని కాపు భవన్ నిర్మాణం కోసం ఎకరా స్థలం కేటాయించగా, వైసిపి ప్రభుత్వం అరెకరాకు కుదించిన విషయాన్ని మంత్రి వద్ద ప్రస్తావించారు. విశాఖలో సినీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు 2015లో శంకుస్థాపన చేసిన ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్‌కు జివిఎంసి నాలుగో వార్డు తిమ్మాపురంలో 5 ఎకరాల స్థలం ఇచ్చినప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల దాన్ని అప్పగించలేదని లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. టిసిఎస్, గూగుల్, కాగ్నిజెంట్, సిఫి తదితర ఐటి కంపెనీలను తన నియోజకవర్గ పరిధిలో ఉన్న ఐటి సెజ్‌కు తీసుకొచ్చినందుకు లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-చీడికాడ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతు శ్రేయస్సుకు ఏర్పాటు చేశారని, వీటి ద్వారా ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ సూచించారు. చీడికాడ మండల కేంద్రం తులసి కళ్యాణ మండపంలో చీడికాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ గవరెడ్డి జగన్నాథం, డైరెక్టర్లతో ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ, సహకార సంఘాల్లో రైతులకు కొత్త సభ్యత్వాలు చేర్పించే అవకాశం కల్పించాలని ఆయన అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే నగదు తోపాటు 7000 రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ, సిఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అందించడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు, సొసైటీ సీఈఓ మజ్జి వరహాల దొర, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పోతల చిన్నం నాయుడు, మాజీ ఎంపీపీ కళావతి, కోనం జలాశయం మాజీ ఛైర్మన్ ముసలి నాయుడు, సర్పంచ్‌లు దాలినాయుడు, సూరినాయుడు, ఎంపిటిసీలు పెద్ది నాయుడు, కోటి పాల్గొన్నారు.

ఎలైట్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాకలో ఎలైట్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : పాత గాజువాక జంక్షన్‌లోని ఆర్‌టిసి రిజర్వేషన్ కౌంటర్ వెనుక ఏర్పాటుచేసిన ఎలైట్ హాస్పిటల్‌ను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎలైట్ హాస్పిటల్‌లో దంత వైద్యంతో పాటు, సర్జికల్ స్పెషలిస్ట్ కూడా అందుబాటులో ఉండడాన్ని అభినందించారు. ఈ హాస్పిటల్‌కు తన వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ కిషోర్‌బాబు, డాక్టర్ ఎ.ప్రతిభ దంత వైద్యానికి సంబంధించి వచ్చిన నూతన పరికరాలను, నూతన వైద్య విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎ.ధీరజ్, ఎ.దివంక, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు కె.కిరీటం, కె.సంతోషం, ఎన్.రాజేంద్రప్రసాద్, జె.కోటేశ్వరరావు, డాక్టర్ స్నేహితులు, బంధువులు, పాల్గొన్నారు.

అసోసియేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా

వినియోగదారుల వెల్ఫేర్ అసోసియేషన్ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక వినియోగదారుల వెల్ఫేర్ అసోసియేషన్ లోగోను గాజువాక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసోసియేషన్‌కు తన వంతు సహకారం ఉంటుందన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అతికినిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి సాలిన ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు దూపం సత్యనారాయణ, గౌరవ సలహాదారులు అమరపిని రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బమ్మిడి శివ, కో-ఆర్డినేటర్ ఆశం మన్మధరావు, సహాయ కార్యదర్శి కట్టా శేఖర్, కార్యవర్గ సభ్యులు దొడ్డి రామకృష్ణ, కె.మల్లికేశవరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రాంబాబు

క్రీడలతో మానసిక ఎదుగుదల

ప్రజాశక్తి -గాజువాక : క్రీడలు మానసిక ఎదుగుదలకు దోహదపడతాయని సిఐటియు నాయకులు ఎం.రాంబాబు అన్నారు. ఇటీవల విసిసి నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్వతంత్రనగర్‌లో ఆదివారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, చదువుతోపాటు, క్రీడలకు కూడా విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విసిసి ఆధ్వర్యాన ఆటపాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వతంత్రనగర్ నాయకులు రాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

శొంఠ్యాం ఆయుర్వేద ఆసుపత్రికి సమస్యల సుస్తీ!

శిథిలభవనంలో నిర్వహిస్తున్న శొంఠ్యాం ఆయుర్వేద ఆసుపత్రి ఇదే

- శిథిల భవనంలోనే బిక్కుమంటూ నిర్వహణ
- మందులు, రికార్డుల నిల్వకూ ఇబ్బందులే
- వైద్యులు, రోగులకు అవస్థలు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు అనారోగ్యం చేసింది. అపుడెపుడో నాలుగు దశాబ్దాల క్రితం, గ్రామానికి శివారును నిర్మించిన సబ్‌సెంటర్ భవనంలో నిర్వహిస్తున్నారు. సొంత భవనానికి ఐదెకరాల స్థలం కేటాయించినా అదివివాదంలో ఉండడతో సొంత భవన నిర్మాణం జరగలేదు.దీంతో పైకప్పు శ్లాబ్ పాడై, గోడలు బీటలు వారి, చిన్నపాటి వర్షం కురిసినా లోపల నిలువనీడ లేని దుస్థితిలో శిథిలావస్థలో ఉన్న భవనంలో నానా ఇబ్బందులు పడుతున్నారు. మందులు, రికార్డుల నిల్వకు ఇబ్బందులే. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం స్పందించి శొంఠ్యాం ఆయుర్వేద ఆసుపత్రి భవనానికి సొంత భవనాన్ని సమకూర్చాలని స్థానికులు కోరుతున్నారు.

శొంఠ్యాంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిని 1983లో అప్పటి ఎమ్మెల్యే ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు హయాంలో ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులకు సైతం ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేని వైద్యవిధానం ఆయుర్వేదంతో సాధ్యమనే నమ్మకం ఉండడంతో నాటి నుంచి నేటి వరకు ఈ ఆసుపత్రికి రోజూ 20మందికి తగ్గకుండా అవుట్ పేషెంట్స్ వైద్యానికి వస్తున్నారు. ప్రస్తుతం శొంఠ్యాం ఆయుర్వేద ఆసుపత్రిలో డాక్టర్ ఎం.



బీటలు వారిన శిథిలమైన గదిలో నిల్వ ఉన్న మందులు

అరుణశ్రీ వైద్యసేవలను అందిస్తున్నారు. గ్రామ శివారున కిటికీలు లేని, గోడలు బీటలు వారి, పైకప్పు పూర్తిగా పాడైన భవనంలో బిక్కుబిక్కుమంటూ వైద్యసేవలు అందించాల్సి వస్తోందని ఆమె వాపోతున్నారు. గ్రామానికి చివరన ఒంటరిగా ఈ ఆసుపత్రి భవనం ఉండడంతో రాత్రి వేళల్లో విషకీటకాలు, పాములు లోపలికి చొరబడి తిష్టవేసే పరిస్థితి ఉంది. పలు సందర్భాల్లో ఆసుపత్రి గదిలో పాములు కనిపించాయని స్థానికులు అంటున్నారు.

ఇక భవనం పైకప్పు పాడవ్వడంతో చిన్నపాటి వర్షం కురిసిన తర్వాత బయట వర్షం వెలిసినా, లోపల వీడకుండా చినుకులు పడుతూనే ఉండే పరిస్థితి ఉంది. దీంతో మందులు నిల్వకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే రికార్డులను భద్రపరచడం తలకుమించిన భారంగా ఉందని డాక్టర్ ఆరుణశ్రీ అంటున్నారు.మరోవైపు ఇక్కడే రూ. 8కోట్లతో ఆయుష్మాన్ ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ కేంద్రం నిర్మాణం పదినెలల క్రితమే పూర్తయింది. ఏర్పాటైంది. దీనికి పరికరాల కోసం ప్రభుత్వం రూ.రెండు కోట్లునిధులు మంజూరు చేసినా అవి సమకూరకపోవడంతో వినియోగంలోకి రాలేదు. అదే జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ఆయుర్వేద మందుల తనిఖీలు, సరఫరా ఇక్కడినుండే జరగనుంది. ఈనేపథ్యంలో ఇంతటి ప్రాధాన్యత ఉన్న శొంఠ్యాం ఆయుర్వేద ఆసుపత్రికి ప్రస్తుతమున్న భవనానికి తక్షణ మరమ్మతులతోపాటు అన్ని సౌకర్యాలతో భవన పునర్నిర్మాణం చేయాల్సి ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

జివిఎంసి వాటర్ ఫెడరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ మహాసభలో వెంకటరెడ్డి

యూనియన్ మహాసభలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నీటి సరఫరా, యుజిడి, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు మినిమం టైమ్ స్కేల్ చెల్లించాలని జివిఎంసి వాటర్ ఫెడరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి డిమాండ్‌చేశారు. యూనియన్ మూడవ మహాసభ ఆదివారం కంచరపాలెంలోని బొట్టా నర్సింగరావు భవనంలో నిర్వహించారు. సభకు పి.వెంకటరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ, 1993లో విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ నరవ ప్లాంట్ నుంచి ప్రారంభమై నేడు నగరవ్యాప్తంగా విస్తరించిందన్నారు. ఉద్యమ ప్రస్థానంలో అనేక సమ్మె పోరాటాలు చేసిందన్నారు. నిర్బంధాలను ఎదుర్కొంటూ అనేక విజయాలను సిఐటియు సాధించిందని తెలిపారు. 2013లో మొదటిగా కాంట్రాక్టు వ్యవస్థను రద్దుపరిచేందుకు ఒప్పందం చేసి కార్మికులతోనే సొసైటీలుగా ఏర్పాటుచేయించిన ఘనత సిఐటియుదేనని తెలిపారు. 22 సంవత్సరాలలో ఇతర సంఘాలు చేయలేని ఒప్పందాలను సిఐటియు సాధించిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వియస్‌పిఎన్ ఏజెన్సీని జివిఎంసి చేతనే పెట్టించిన విషయాన్ని గుర్తుచేశారు. 2022 నుంచి 2025 వరకు మూడేళ్ల కాలంలో సిఐటియు నిర్వహించిన పోరాటాలు, విజయాలపై ఈ మహాసభలో సమీక్షించి భవిష్యత్తు కర్తవ్యాలను మహాసభ నిర్దేశించింది.

తీర్మానాలు

నీటి సరఫరా, యుజిడి, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఈ లోగా మినిమం టైమ్ స్కేల్ చెల్లించాలని, కౌన్సిల్ తీర్మానం ప్రకారం 950 మందికి సెమి స్కిల్డ్, స్కిల్డ్ పెరిగిన వేతనాలను చెల్లించాలని, 124 జిఒ ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులందరికీ వేతనాలు పెంచాలని, డెత్, రిటైర్డ్ కార్మికుల బిడ్డలకు వెంటనే ఉపాధి కల్పించాలని, అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, జిఒ 25 ప్రకారం సహజ ప్రమాద మరణాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, షీలానగర్‌లో ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను వెంటనే తెరవాలని, ప్రజలపై భారాలు మోపే అదాని స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఇపిఎస్ - 95 కనీస పెన్షన్ రూ.9 వేలుగా నిర్ణయించాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని పలు తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

మహాసభ పరిశీలకులుగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జివిఎంసి వాటర్ ఫెడరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులుగా కెసిహెచ్.రామకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా కె.వెంకటరావు, కోశాధికారిగా కనకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.ఆనంద్‌కుమార్, వర్కింగ్ జనరల్ సెక్రటరీగా గండి రమణ, ఉపాధ్యక్షులుగా బి.శ్రావణ్, ఎస్.సంతోష్, సహాయ కార్యదర్శులుగా జోగ లక్ష్మి, డి.తరుణ్‌కుమార్, డిజె.మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'సృష్టిగర్భ' గ్రంథ పరిచయం

ప్రజాశక్తి- సీతమ్మధార : కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ విరచిత 'సృష్టిగర్భ' (ఉపనిషత్కాంతి) గ్రంథ పరిచయ సభ పౌర గ్రంథాలయంలో శ్రీమాతా కళా పీఠం నేతృత్వంలో నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్.మాధవ్ హాజరై మాట్లాడుతూ, ఉపనిషత్తులలోని లోతైన భావాలను హృదయాలకు హత్తుకునేలా పుస్తకంలో పేర్కొన్నారని తెలిపారు. అనంతరం శ్రీమాతా కళా పీఠం అధినేతలు బిఎన్.మూర్తి, పల్లి నాగభూషణం సారధ్యంలో గ్రంథకర్త దీర్ఘాసి విజయభాస్కర్‌కు 'నాటక రత్న' బిరుద ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పొలమరశెట్టి ఫ్రాన్సిస్, రామకృష్ణానంద్, డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ, వాడ్రేవు చిన్న వీరభద్రుడు, డాక్టర్ అందెశ్రీ, అల్లు కేశవ వెంకట జోగినాయుడు, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా భూలోకమాత ఉత్సవాలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని భూలోకమాత అమ్మవారి ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం అనందపురం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవంలో ఆనందపురం, ఎల్‌వి.పాలెం, వేములవలస, బిపి.కల్లాలు తదితర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సమ్మె ఒప్పందాల అమలుకు పోరాటం

- కనీస వేతనాలు, గ్రాట్యూటీ అమలులో నిర్లక్ష్యం
- అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ పదో

జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి

ప్రజాశక్తి- సబ్బవరం : అంగన్వాడీల కనీస వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారంపై సమ్మె సందర్భంగా ఇచ్చిన ఒప్పందాల అమలుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఇ.చంద్రావతి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షులు ఎం దుర్గారావు, రమణి అధ్యక్షతన జరిగిన యూనియన్ పదవ జిల్లా మహాసభలో మాట్లాడుతూ మాత శిశు మరణాలు నివారణకు, పిల్లలకు కౌమార విద్యను అందించేందుకు అంగన్వాడీ వర్కర్లు గ్రామాల్లో విశేషసేవలు అందిస్తున్నా, వారిని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గతంలో 42 రోజులు సమ్మెచేస్తే, అప్పటో వేతనాలు పెంచుతామని, గ్రాట్యుటీ చెల్లిస్తామని ఒప్పందం కుదిరినా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు అప్పట్లో విపక్షంలో ఉన్న కూటమి నేతలు సమ్మె శిబిరాలకు వచ్చి అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని మాటిచ్చారన్నారు. అయితే టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలల గడిచినా అంగన్వాడీల కిచ్చిన హామీలను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేసారు.

అంగన్వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలని,గ్రాట్యుటీ అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పును సైతం బేఖాతరు చేయడం దుర్మార్గమన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్ఆర్ఎస్ పేరుతో అంగన్వాడీలను ఇబ్బందులను గురి చేస్తున్నారని మండిపడ్డారు. అంగన్వాడీ కనీస అవసరాలను అమలు చేయకుండా ఆదనపు బాధ్యతల్ని అప్పజెప్పడం అన్యాయమన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయింపులు చేయకుండా ఐసిడిఎస్ను నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. పదేళ్లుగా అంగన్వాడీలకు వేతన పెంపులేక, అరకొర వేతనాలతోనే వెట్టిచాకిరీ చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ఫోన్లు,నెట్వర్క్ పనిచేయకున్నా, రకరకాల యాప్లతో పనిభారాన్ని పెంచి ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు నివేదికను ప్రవేశపెట్టారు. ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు, మాట్లాడుతూ నగదు బదిలీ పథకాల ద్వారా స్వచ్ఛంద సంస్థలకు ఐసిడిఎస్ను అప్పగించే కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. లేబర్ కోడ్స్తో కార్మిక హక్కులను, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్న కేంద్ర ప్రభుత్వ చర్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వివి రమణమ్మ, రమణి సత్యవేణి, బుజ్జి, తనూజ, రామలక్ష్మి, కష్టవేణి, మధ్యాహ్న భోజన పథకం నాయకులు గూడూరు వరలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్వాడీల జిల్లా మహాసభలో మాట్లాడుతున్న చంద్రావతి

జిల్లా కమిటీ నూతన కార్యవర్గం

ఎం.దుర్గారాణి
అధ్యక్షురాలు

ఎం.నాగశేషు
ప్రధాన కార్యదర్శి

వివి.రమణమ్మ
కోశాధికారి

అంగన్వాడీల అసోసియేషన్ మహాసభలో జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షురాలిగా జి కుమారి, అధ్యక్షురాలిగా ఎం. దుర్గారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎం.నాగశేషు, కోశాధికారిగా వివి రమణమ్మ, జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులుగా ఎస్.వరలక్ష్మి కె .రామలక్ష్మి, పి భవాని, ఆర్ .మహాలక్ష్మి, తనూజ, ఎం .రమణి, చిన్నమ్ములు, సత్యవేణి, మంగ, టి.సంతోషి, అంజలి, సిహెచ్. రామలక్ష్మి మరో పదకొండు మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పీలా జన్మదినం సందర్భంగా ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -అనకాపల్లి రూరల్ : మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జన్మదినం సందర్భంగా ఆదివారం జివిఎంసి 83వ వార్డు టిడిపి ఇన్ఛార్జి బొడ్డపు ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. లక్ష్మీదేవిపేట స్కూల్లో బిఎం చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో రోగులకు కంటి, గుండె, ఆర్థో సంబంధిత వైద్యపరీక్షలు నిర్వహించి,. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 82వ వార్డు టిడిపి ఇంచార్జి పోలారావు త్రినాథ్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ముకుంద, పెంటకోట శ్రీనివాసరావు, నాగార్జున, రియాజ్, కొణతాల వాసు, గణేష్, రాంప్రసాద్, కర్రి గోపి, వాసు, శివాజీ, ఫణి, కూటమి నేతలు పాల్గొన్నారు.

నేడు పీలా గోవింద జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కశింకోట : రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జన్మదిన వేడుకలను సోమవారం ఉదయం 8 గంటలకు అనకాపల్లి పట్టణం, రింగ్ రోడ్డులోని, పెంటకోట కన్వెన్షన్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నారని స్థానిక టిడిపి నేతలు తెలిపారు. కూటమి నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భట్టి విక్రమార్కను కలిసిన శ్రీనివాస్

ప్రజాశక్తి - పాయకరావుపేట : విశాఖలో ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను పాయకరావు పేట కాంగ్రెస్ నేత, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కలిసి, భట్టి విక్రమార్కతోపాటు ఎఐసిసి సభ్యులు గిడుగు రుద్రరాజును శాలువాలతో సత్కరించారు.

భట్టి విక్రమార్కతో జగతా శ్రీనివాస్

అపూర్వ కలయిక

కలుసుకున్న కొణతాల కాలేజ్ డిగ్రీ మొదటి బ్యాచ్ విద్యార్థులు

ప్రజాశక్తి- అనకాపల్లి : కొణతాల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ 1993-96 డిగ్రీ బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. సన్ కాస్ట్ హోటల్లో జరిగిన కార్యక్రమం ఆద్యంతం హుషారుగా సాగింది. ఎక్కడెక్కడో విదేశాల్లో స్థిరపడిన వారందరూ ఒక చోట కలిసి అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు. డాన్సులు, కేరింతలతో సందడి చేశారు.. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు సంస్కారం, విలువలు అవసరమన్నారు. ఈ బ్యాచ్లో విద్యార్థులకు ఆటువంటి లక్షణాలు కనిపించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ వెంకటరావు, అధ్యాపకులు రవికుమార్, పద్మావతి, సింహాద్రి, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, గోవిందరాజు, గణేష్, విద్యార్థులు నాయుడు, కుమార్, సురేష్, ప్రభాకర్, లక్ష్మణ్, శ్రీను, విస్సు, శైలజ, పద్మ పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెత్తను తొలగించరూ?

జాతీయ రహదారి పక్కన వున్న చెత్త కుప్పలు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని చింతలపాలెం గ్రామం కాలనీ, ఆంజనేయస్వామి గుడి వద్ద జాతీయ రహదారిలో రోడ్డు పక్కన చెత్తను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. గ్రామంలో చెత్తాచెదారాన్ని ఇష్టానుసారంగా జాతీయ రహదారి పక్కన వేయడంతో అది పోగులుగా పడి, ఇటీవల కురుస్తున్న వర్షాలకు అది కుళ్లి దుర్గంధం వెదజల్లుతూ పరిసర ప్రాంత ప్రజలతోపాటు జాతీయరహదారిలో ప్రయాణిస్తున్న వాహనదారులు, ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు ఇళ్లల్లో వస్తున్న చెత్తను తడిపొడిగా వేరుచేసి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అప్పగించాల్సిన ప్రజలు ఇలా రోడ్డు పక్కన పడేయడం వల్ల అందరూ ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. పంచాయతీ యంత్రాంగం స్పందించి తక్షణమే చెత్తను తొలగించడంతోపాటు మున్ముందు వ్యర్థాలను వేయకుండా తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నేడు వెంకటరమణ సంతాప సభ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : పూడిమడక గ్రామ మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ సంతాపసభను సోమవారం పూడిమడకలో ఏర్పాటు చేస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.ఇటీవల అనారోగ్యంతో వెంకటరమణ మృతి చెందాడు. సంతాప సభకు పార్టీలకతీతంగా అభిమానులు అధికారులు శ్రేయోభిలాషులు రావాలని కోరారు.

స్పేసెస్ కళాశాల అధ్యాపకునికి అవార్డు

- వర్సిటీ స్థాయి ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్గా తాతయ్యనాయుడు

ప్రజాశక్తి- పాయకరావుపేట: : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి తాతయ్యనాయుడు ఎయు వర్సిటీ స్థాయిలో ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్గా ఎంపికయ్యారు. ఆదివారం ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ జిపి రాజశేఖర్ నుంచి అవార్డు స్వీకరించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ రామకృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆయనను ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసరుగా నియమించారన్నారు. తమ కళాశాల మేనేజ్మెంట్, విద్యార్థుల సహకారంతో గత విద్యా సంవత్సరంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు ఈ అవార్డు పొందడం ఆనందంగా ఉందన్నారు.. అవార్డు గ్రహీత నాయుడును ఎయు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్యులు డి సింహచలం, ప్రకాష్ విద్యాసంస్థల అధినేత సిహెచ్వికె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎయు విసి నుంచి అవార్డు స్వీకరిస్తున్న తాతయ్యనాయుడు

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

రైతులతో మాట్లాడుతున్న వెటర్నరీ ఎడిఎ చిట్టినాయుడు

ప్రజాశక్తి -సబ్బవరం : భారీ వర్షాల నేపథ్యంలో పాడి రైతులు పశుసంరక్షణలో అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సబ్బవరం ఏరియా పశు వైద్య శాల ఇన్చార్జి సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టి నాయుడు తెలిపారు. ఆదివారం మండలంలోని అరిపాక పంచాయతీ చిన యాతపాలెంలో పాడి రైతులతో అవగాహన సదస్సులో మాట్లాడుతూ పశువులను కొట్టాలలో తాళ్లతో గట్టిగా కట్టరాదని, . పాడుబడ్డ శాలల్లో పశువులను ఉంచరాదని సూచించారు. నీరు ఎక్కువగా ఉండే గుంటలు, చెరువులు, జలాశయాలు వద్దకు పశువులు, గొర్రెలు, మేకలను తీసుకెళ్లరాదన్నారు. కరెంటు స్తంభాలకు దూరంగా పశువులను ఉంచాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని పాడిపశువులు, జీవాలు, కోళ్లను ఎత్తైన ప్రదేశాలకు తరలించాలని సూచించారు. ఏదైనా విపత్తుతో మూగజీవాల మరణం జరిగితే వెంటనే సమీప వెటర్నరీ అసిస్టెంట్కు లేదా పశువైద్యశాలకు సమాచారం అందించాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో మండలంలో అత్యవసర పశు వైద్యసేవలకు మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

దీక్ష విరమించిన సునీత

నిమ్మరసమిచ్చిన దీక్ష విరమింపజేస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తిమ్మరాజుపేట గ్రామంలో అంగన్వాడి కార్యకర్త నియామకంలో తనకు అన్యాయం జరిగిందని డిమాండ్ చేస్తూ 34 రోజులుగా అంబేద్కర్ విగ్రహం ఆవరణలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న మంత్రి సునీత ఆదివారం జనసేన కార్యకర్తల హామీతో దీక్ష విరమించారు. దీక్ష చేస్తున్న మంత్రి సునీతను ఆదివారం మాజీ జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు జనసేన మండల శాఖ అధ్యక్షుడు బయలుపూడి రామదాసు, సీనియర్ నాయకుడు కరెడ్ల ప్రకాష్ దీక్షా శిబిరాన్ని సందర్శించారు. తనకు జరిగిన అన్యాయాన్ని వారి వద్ద సునీత మొరపెట్టుకుంది. ఎమ్మెల్యే హామీ మేరకు రానున్న రోజులలో మంత్రి సునీతకు న్యాయం చేస్తామని హామీ ఇస్తూ, నిమ్మరసం ఇచ్చి దీక్షన విరమింప చేశారు. కార్యక్రమంలో సరగడం శివ బాపు నాయుడు, రేవిడి కష్ణ, దిమ్మల జగ్గారావు, రేవిడి జానీ, మల్ల చినబాబు, మైలపల్లి శ్రీను కారు చంద్రరావు పాల్గొన్నారు.

జనవాణిలో వినతుల స్వీకరణ

వినతులు స్వీకరిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామంలో రావిచెట్టు వీధిలో జనసేన ఆధ్వర్యంలో జనవాణి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉన్నప్పటికీ లబ్ధి పొందని పలువురు రైతులు తమ సమస్యలను జనసేన నాయకులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నేతలు భరోసానిచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ అధ్యక్షుడు కొట శేషు, ఉపాధ్యక్షుడు గణేష్, నాయకులు మరిసా కాటాలు, సోషల్ మీడియా నిర్వాహకుడు జెర్రిపోతుల చిన్నంనాయుడు, నాయకులు కంటంరెడ్డి బుజ్జి, తోకల చిన్నారావు, యన్నంశెట్టి రమణ, మరిసా సూరిదేముడు పాల్గొన్నారు.

వైసిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాము

కొటాన రాము

ప్రజాశక్తి -సబ్బవరం : వైసిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాజీ జెడ్‌పిటిసి కొటాన రాము నియమితులయ్యారు. ఈ సందర్భంగా తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను 2017లో ధర్మాన ప్రసాదరావు ఆశీస్సులతో పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసిపి సభ్యత్వం తీసుకున్నానని, తన రాజకీయ అనుభవాన్ని, సేవలను పార్టీ గుర్తించి పార్టీ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామిగా చేశారన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రాధాన్యతనిచ్చి తనను పార్టీబీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత, జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ సారధ్యంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కొటాన సత్తిబాబు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బిసి హాస్టళ్లలో నియామకాలు

- అవసరమైన చోట్ల తక్కువ మంది..
- అవసరం లేని చోట్ల ఎక్కువ మంది కేటాయింపు
- జిల్లా బిసి వెల్ఫేర్ అధికారికి తెలిసే జరుగుతోందని ఆరోపణలు

జిల్లా బిసి సంక్షేమశాఖ కార్యాలయం

ప్రజాశక్తి-విశాఖపట్నం : అనకాపల్లి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహాల్లో పనిచేసే క్లాస్ ఫోర్ సిబ్బంది నియామకాల్లో నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది కేటాయింపులు జరగాల్సి ఉండగా పైరవీలు కారణంగా కొన్ని హాస్టళ్లలో ఉండాల్సిన దాని కంటే ఎక్కువ మంది సిబ్బంది ఉండగా, మరికొన్ని హాస్టళ్లలో ఉండాల్సి సిబ్బంది కంటే తక్కువ మంది ఉన్నారు. ఇదంతా జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్‌కు తెలిసే జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనకాపల్లి జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 38, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు 12 నడుస్తున్నాయి. ప్రతి హాస్టల్‌లో 100 మంది విద్యార్థులు, ముగ్గురు క్లాస్ ఫోర్ సిబ్బంది (ఒక వంటమనిషి, ఒక కామటి లేదా ఫ్యూన్, ఒకరు వాచ్మెన్) ఉండాలి. కాని జిల్లాలోని పలు హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడా సిబ్బంది లేరు. మొత్తం హాస్టళ్లను పరిశీలిస్తే హాస్టళ్లలో కనిష్టంగా 20 నుంచి గరిష్టంగా 370 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 100 మంది విద్యార్థులకు పైన తెలిపిన ముగ్గురు సిబ్బంది విధిగా ఉండాలి. అయితే చోడవరం మండలం గోవాడ బాలికల వసతి గృహంలో 175 మంది బాలికలు ఉండగా అక్కడ సుమారు ఐదుగురు పని చేయాల్సి ఉంది. కాని ముగ్గురు మాత్రమే పని చేసేవారు. వారిలో ఒకరిని ఎలమంచిలి బాలికల హాస్టల్‌కు మార్చడంతో గోవాడలో ఇద్దరే పని చేస్తున్నారు. ఎలమంచిలి హాస్టల్ నుండి ఒకరిని 50 మంది విద్యార్థులున్న గొడిచర్ల బాలుర హాస్టల్‌కు పంపారు. నర్సీపట్నం పోస్టుమెట్రిక్ బాలికల హాస్టల్‌లో 140 మంది విద్యార్థులకు నలుగురు సిబ్బంది ఉన్నారు. మరో వైపు నాతవరం బాలుర హాస్టల్‌లో 50 మంది విద్యార్థులు ఉండగా అక్కడ నలుగురు సిబ్బంది, కోటవురట్ల ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్లో 120 మంది విద్యార్థులకు ఆరుగురు సిబ్బంది పని చేస్తున్నారు.

శాంక్షన్ పరిమితికి మించి పలు హాస్టళ్లలో విద్యార్థులు ఉండగా మరికొన్ని హాస్టళ్లలో తగినంత మంది విద్యార్థులు లేరు. ఉదాహరణకు వేములపూడి గర్ల్స్ హాస్టల్లో 100 మంది ఉండాల్సి ఉండగా 370 మంది, అనకాపల్లి కాలేజీ గర్ల్స్ హాస్టల్లో 170 మంది, నర్సీపట్నం గర్ల్స్ ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో 270, లంకెలపాలెం బాయ్స్ హాస్టల్లో 180 ఇలా లెక్కకు మించి విద్యార్థులు ఉన్నారు. ఇలా ఎక్కువ మంది విద్యార్థులున్న హాస్టళ్లలో సరిపడా సిబ్బంది లేనట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా పలు హాస్టళ్లలో క్లాస్ ఫోర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 17 వాచ్మెన్, 19 కమాటీ/ఫ్యూన్, నాలుగు వంట మనుషుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను భర్తీ చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు.

సంక్షేమ వసతి గృహాల్లో ప్రతి పదిమందికి ఒక బాత్ రూమ్‌ఉండాల్సి ఉండగా విద్యార్థులకు సరిపడా బాత్ రూములు లేని హాస్టళ్లు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఎలమంచిలి హాస్టళ్లలో పనిచేసే పదిమంది సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఆర్‌టిసి స్థలాలు 'లూలూ'కు ఇవ్వొద్దు

జిఒ 137 రద్దు చేయాలి :ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి

మాట్లాడుతున్న ఏపీపిటిడి నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్: ఆర్‌టిసి స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఒ. 137 ను రద్దు చేయాలని ఎపిపిటిడి (ఆర్‌టిసి) ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ బాసూరు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్‌టిసి ఆస్తుల పరిరక్షణకు సంస్థలోని అన్ని సంఘాలు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా రవాణా సంస్థ ఆర్‌టిసి ఆస్తులు ప్రైవేటు వ్యాపార వేత్తలకు ధారాదత్తం చేస్తున్న చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న ఆర్టీసి గవర్నర్ పేట- 1,2 డిపోలు, పాత బస్‌స్టాండ్‌కు చెందిన రూ.నాలుగు వందల కోట్ల విలువైన 4.15 ఎకరాల స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. దశబ్దాలుగా ప్రజలకు రవాణా సౌకర్యాలు అందిస్తూ, ఆ రెండు డిపోలలోని 200 బస్సులను 1100 మంది ఉద్యోగులను ప్రజలకు దూరం చేస్తూ బడా వ్యాపారవేత్తలకు సంస్థ భూములను కట్టబెట్టే జిఒ137 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు డీ.లోవరాజు, జోనల్ కార్యదర్శి.జి .తాతాలు, స్టేట్ మెయింటినెన్స్ కమిటీ సభ్యులు ఎస్వి రమణ, జిల్లా అధ్యక్షులు డిఎల్ రాజు, జిల్లా జాయింట్ సెక్రెటరీ వైవీఎస్ కుమార్, జిల్లా కోశాధికారి ఐ ఎస్ బాబు, నర్సీపట్నం డిపో సెక్రెటరీ బి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో రామాలయం వద్ద ఆదివారం అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచిస్పందన లభించింది. నేత్ర వైద్య శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్ గోంప వెంకటరావు ప్రారంభించారుకంటి వైద్య శిబిరంలో 62 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ అందజేశామన్నారు. 19 మంది రోగులను కంటి ఆపరేషన్స్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్‌లో తరలించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ సింగంపల్లి అచ్చిబాబు, ట్రస్ట్ సభ్యులు సిరవురపు శివ ప్రసాద్, బొబ్బిలి సన్యాసి నాయుడు, రొంగలి మురళి, సింగంపల్లి శివ వెంకట్, సింగంపల్లి నాగం నాయుడు, శంకర్ ఫౌండేషన్ డాక్టర్.దీపక్, కాంప్ మేనేజర్ అరుణ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ గుడి నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న సత్యనారాయణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో పోలేపల్లిలో దుర్గమ్మ గుడి నిర్మాణానికి విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సీత బుజ్జి, ఎంపిటిసి సీత సన్యాసినాయుడు, బిజెపి మండల అధ్యక్షులు సీతా నాగరాజు, మండల టిడిపి అధ్యక్షులు మాజీ ఎంపిపి ఎంవివి సత్యనారాయణ,బుచ్చయ్యపేట కోఆపరేటివ్ అధ్యక్షులు డొంకిన అప్పలనాయుడు, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షులు దేవర అప్పారావు, కె పి అగ్రహారం టిడిపి అధ్యక్షులు అడ్డూరి శ్రీను గారు, స్థానిక కూటమి నాయకులు నీటి సంఘం డైరెక్టర్ మాణిక్యం, పర్రె సత్తిబాబు, సీత గోవింద, పర్రె శివ, గణేషు, కాసు, సూరినాయుడు పాల్గొన్నారు.

గంగాలమ్మను దర్శించుకున్న రమాకుమారి

ప్రజాశక్తి- మునగపాక: మండలంలోని మూలపేట గ్రామంలోని గంగాలమ్మ అమ్మవారిని యలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమా కుమారి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ నిర్మాణ కమిటీ ఆమెను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. గతంలో అమ్మవారి గుడి నిర్మాణంలో విశాఖ డెయిరీ నుంచి రూ. 3 లక్షల నిధులను ఆలయ పెయింటింగ్‌కు విరాళంగా అందజేశారు.

కార్యక్రమంలో అనకాపల్లి జోనల్ ఆఫీసర్ సరగడం రమణ, సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు, విశాఖ డెయిరీ పాలసంఘం మాజీ అధ్యక్షులు సరగడం నాగేశ్వరరావు, కాండ్రేగుల నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు ఎల్లపు రాజేశ్వరరావు, భీశెట్టి నాగేశ్వరరావు, ఎల్లపు నాగేశ్వరరావు, ఆడారి సత్యనారాయణ, బి శెట్టి వీరు నాయుడు, బొడ్డెడ ఆదికుమార్ పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

-కూలిన వృక్షాలు - జీవాలు మృత్యువాత

విజయరామరాజుపేటలో

ప్రజాశక్తి-నక్కపల్లి: అల్ప పీడనం ప్రభావంతో ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వర్షంతో మండలంలో అక్కడక్కడ రైతులు వరి నాట్లు ప్రారంభించారు. రోజంతా తెరిపివ్వకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వర్షపునీరు ప్రవహించడంతో ముఖ్యంగా ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. పల్లె గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా దర్శనమిచ్చాయి. ఈ వర్షాలతో మెట్టు ప్రాంతాల్లో కూడా రైతులకు వరి నాట్లు

చీడికాడ:మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం గంటల వరకు కూడా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. మండలంలో ఇప్పటికే 60 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. ఆదివారం కురిసిన భారీ వర్షాలతో మెట్టు ప్రాంత గ్రామాల్లో కూడా దమ్ములు పూర్తి కావచ్చునని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాలవెల్లి జలాశయంలో నీటిమట్టం భారీగా పెరిగిందని జలాశయం ఛైర్మన్ పాతల చిన్నమనాయుడు అన్నారు. మండలంలోని కోనాం గ్రామంలో పాలవెల్లి జలాశయంలో నీటిమట్టం 96 అడుగులకు చేరుకున్నట్టు ఆదివారం విలేకరులతో తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటిమట్టం 105 అడుగులు కాగా 96 అడుగులకు చేరుకున్నట్టు ఆయన తెలిపారు.భారీ వర్షాలకు ఇంకా నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. వర్షాలతో వరి నాట్లు పూర్తవుతాయన్నారు

గొలుగొండ:మండలంలోని జోగుంపేట నుంచి జమ్మాదేవిపేట వెళ్లే రోడ్డులో కురుస్తున్న వర్షానికి భారీ చెట్టు కూలిపోయింది. రోడ్డుకు అడ్డంగా ఈ చెట్టు కూలి పోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్టు కూలే సమయంలో అటుగా ఏ వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

నర్సీపట్నం:నర్సీపట్నం నుండి చింతపల్లి వెళ్లే రహదారిపై చింత చెట్టు కూలి పోవడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాలలో కురిసిన వర్షాలకు రోడ్లపై నుంచి నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది.

కోటవురట్ల:కోటవురట్లలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భారీ వర్షం కురిసింది. మండల పరిషత్ కార్యాలయం వద్ద నీరు చేరడంతో చెరువును తలపిస్తుంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కశింకోట : అల్పపీడన ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షంతో పల్లపుప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. ఎ డతెరిపిలేని వర్షంతో అనకాపల్లి, యలమంచిలి, గాజువాక తదితర ప్రాంతాలకు పనులకు వెళ్లే కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు.

అచ్యుతాపురం : రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు వరి నారుమళ్ల, చెరుకు తోటలకు ఊపిరి పోసాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొన్నాళ్లుగా వర్షాభావ పరిస్థితుల్లో నారుమళ్ల బోర్లునీటి మోటార్ల నీటితో తడుపుతూ అవస్థలు పడ్డ రైతులు, ఇపుడు పొలాల్లో నీరు చేరడంతో సాగు పనులు చేసుకునే వీలుంటుందని అంటున్నారు. వీడకుండా కురిసిన వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

బుచ్చయ్యపేట :.శనివారం రాత్రి నుండి తెరిపివ్వకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వర్షం లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వడ్డాది పెద్దేరు నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రజలు ఇళ్లకే

కోటవురట్లలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

పరిమితమయ్యారు. రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోయారు. ఆదివారం వడ్డాదిలో వారపు సంత వెలవెల పోయింది. గ్రామాల్లో వీధుల్లో భారీగా నీరు చేరింది.

కంట్రోల్‌రూం ఏర్పాటు

బుచ్చయ్యపేట : భారీ వర్షాల నేపథ్యంలో మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు

ఆనందపురంలో...

తహశీల్దార్ లక్ష్మి తెలిపారు. వర్షంతో ఎటువంటి ఇబ్బందులున్నా 08934 294391 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు, పాతబడిన, శిథిల గృహాల్లో నివసిస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మధురవాడ : మధురవాడ అండర్ పాత్ బ్రిడ్జి వద్ద సర్వీస్ రోడ్డు జలమయం కావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కాలువలను శుభ్రపరిచేందుకు కొన్నిచోట్ల మూతలు తిసేశారు. దీంతో ఎక్కడ ఎటువంటి ప్రమాదం జరుగుతుందోని పలువురు ఆందోళన చెందుతున్నారు. మధురవాడ నుంచి మార్కెట్ మీదుగా స్వతంత్ర నగర్ కాలనీ రోడ్డు పూర్తిగా జలమయమైంది.

గాజువాక : గాజువాక దుర్గానగర్ జంక్షన్ నుంచి స్టీల్ ప్లాంట్ వెళ్లే రహదారిలో రైల్వే ట్రాక్ కింద జలమయమైంది. వర్షంతో నీరు ప్రవహించడానికి వీలు లేక రోడ్డు మొత్తం జలమయం కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

సీతకొండ నుంచి విరిగిపడ్డ రాళ్లు

వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి గౌరీనగర్, రిక్షా కాలనీ, గణేష్‌నగర్ వరద ముంపు ప్రాంతాలను మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు.

తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి సంగివలస అల్లూరి సీతారామరాజు కాలనీలో చివర పల్లపు ప్రాంతంలో వర్షపు నీరు వరదలా ప్రవహిస్తోంది. దీంతో అక్కడున్న దాదాపు 15 కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. కొన్ని ఇళ్లల్లోకి నీరు చేరడంతో శనివారం రాత్రి నుంచి కంటి మీద కునుకు లేకుండా నీటిని బయటకు తోడు కుంటున్నారు.

ఆనందపురం: ఆనందపురం పంచాయతీ ఎస్‌సి,

గొలుగొండ వద్ద కూలిన చెట్టు

బిసి కాలనీ దుర్గమ్మ గుడి సమీపంలోని ఇళ్లలోకి కొండ ప్రాంతం నుంచి వచ్చే వర్షం నీరు చేరుతోంది. కాలువలు లేకపోవడంతో నేరుగా ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఊపందుకున్న ఉడుపులు..

భీమునిపట్నం : నిన్నటి వరకు తీవ్ర వర్షాభావంతో పంట భూములు బీటలు వారి ఉన్నాయి. రైతాంగం చుక్క చినుకు కోసం ఆకాశం వైపు ఆత్రంగా ఎదురు చూసిన పరిస్థితి ఉంది. జూన్ నెలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక రైతాంగంలో ఒకింత ఆందోళన నెలకొంది. అడపా దడపా కురిసిన వర్షాలతో నేల తడవనే లేదు.

కోనాం జలాశయంలో నీరు

భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో ఉన్న రైతాంగం పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ రైతు మోములో ఆశలు చిగురించాయి.

రెండ్రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. భీమిలి మండలంలో ఆదివారం 72.8 మిల్లీ మీటర్లు, ఆనందపురం మండలంలో 35.4 మిల్లీ మీటర్లు, పద్మనాభం మండలంలో 49.8 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది.

ప్రస్తుత వర్షంతో మూడు మండలాల్లో ఉడుపులు ఊపందుకున్నాయి. ఆనందపురం మండలంలో వరి పంట సాధారణ విస్తీర్ణం 1548 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు సుమారు 250 ఎకరాలు, పద్మనాభం మండలంలో వరి పంట సాధారణ విస్తీర్ణం 7015 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు సుమారు 550 ఎకరాల్లో ఉడుపులు వేశారు. భీమిలి మండలంలో వరి పంట సాధారణ విస్తీర్ణం 1298 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు సుమారు 200 ఎకరాల్లో ఉడుపులు వేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి సకాలంలో వర్షాలు కురిస్తే ఈ సమయానికి వరి పంట పిలకలు తొడిగే దశకు చేరి ఉండేది. ఇదే విధంగా వర్షాలు కురిస్తే ఈ ఏడాది ఖరీఫ్ ఆశాజనకంగానే ఉంటుంది.

కూలుతున్న గోడలు

ఆరిలోవ : రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతాల్లో గోడలు నాని కూలిపోతున్నాయి. ఆదివారం కురిసిన భారీ వర్షానికి కొండవాలు ప్రాంతమైన పెదగదిలి ప్రాంతంలో ఒక ఇంటి రక్షణ గోడ, బాత్ రూం గోడ కూలి పోయాయి. 13వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో ఒక ఇంటి రక్షణ గోడ కూలిపోయింది. తీర ప్రాంతంలోని సీత కొండ కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రహదారి, ఫుట్‌పాత్‌లు రాళ్లు, మట్టితో కప్పబడ్డాయి. ఈ ఘటనల్లో ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇంకా వర్షాలు పడే అవకాశం ఉందన్న హెచ్చరికలతో కొండవాలు ప్రాంతాల ప్రజలు ఆందోళనతో ఉన్నారు. ముఖ్యంగా హనుమంతవాక నుంచి దీనదయాల్‌పురం వరకు గల కొండవాలు ప్రాంతాల కాలనీలు, తోటగరువు, బిఎన్ఆర్.నగర్, విశాలాక్షినగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్ కొండవాలు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

మధురవాడలో..

పిడుగుపాటుకు 30గొర్రెలు మృత్యువాత

చోడవరం : మండలంలోని దుద్దుపాలెం గ్రామంలో ఆదివారం వర్షంతో పిడుగుపాటుకు 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఉదయాన్నే మేతలకు తీసుకెళ్లిన సమయంలో గొర్రెలపై పిడుగు పడడంతో కుర్మదాసు తాతారావుకు చెందిన 20గొర్రెలు, మొల్లి గోవింద, కుర్మదాస్ రమణకు చెందిన చెరో ఐదు గొర్రెలు మరణించాయి. రూ.మూడు లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత పెంపకందారులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

అస్తవ్యస్తంగా ఉన్న మార్కెట్ యార్డు ప్రాంతం

మార్కెట్ యార్డుకు వెళ్లాలంటే... ముక్కు మూయాల్సిందే..

ప్రజాశక్తి- నర్సీపట్నం: నర్సీపట్నం మార్కెట్ యార్డుకు వెళ్లాలంటే అధికారులు, నాయకులు, ప్రజలు ఎవరైనా ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధాన ద్వారం వద్ద మురుగు నీరు నిలిచి పోవడంతో దుర్గంధం వెలువడుతోంది. విశాఖపట్నంకి వెళ్లే ప్రధాన రహదారిని అనుకుని ఉంది. ఈ మార్కెట్ యార్డ్ ద్వారం, మార్కెట్ యార్డులో వివిధ కార్యాలయాల సముదాయంతో పాటు అధికారులు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులు ప్రధానంగా మార్కెట్ యార్డ్ సిబ్బంది నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు.

మార్కెట్ యార్డ్ సమీపంలో నూకాలమ్మ వీధి ప్రాంతం నుంచి గృహ వినియోగదారులు వాడుకునే నీరు మార్కెట్ యార్డ్ వరకు వచ్చి నిలిచిపోతుంది. మార్కెట్ యార్డ్ వెనుక భాగంలో మరో కాలువ ప్రధాన రహదారిని అనుకుని కూరగాయల మార్కెట్ యార్డ్ సమీపంలో కాలువలు నిర్మించక పోవడంతో ఆ ప్రాంతం అంతా కూడా తీవ్రమైన దుర్గంధంతో కాలనీవాసులు, దుకాణదారులు అవస్థలు పడుతున్నారు. ఇరువైపులా కాలువల నిర్మాణం చేపట్టక పోవడంతో మురుగు నీరు అక్కడే నిలిచిపోతుంది. ఈ ప్రాంతంలో కొన్ని తాగునీటి కుళాయిలు కూడా కాలువ మధ్యలో ఉండటం విశేషం. దీంతో కాలనీలో దోమల బెడద కూడా అధికంగా ఉంటుంది. మున్సిపాలిటీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

నిలిచిన మురుగునీరు

21న మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురం, సీహెచ్.నాగాపురం, పాతకృష్ణదేవిపేటలో ఈ నెల 21న శ్రీమరిడిమాంబ అమ్మవారి పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ నేపథ్యంలో ఆయా ఆలయాలను రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా విద్యుత్ అలంకరణ చేస్తున్నారు. పండుగ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు తెలిపారు.

నేడు అతి భారీ వర్షాలు

ప్రజాశక్తి- అనకాపల్లి : అల్పపీడనం ప్రభావంతో ఈనెల 18న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు,విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

‘ఈగల్’తో గంజాయి నిర్మూలన

హోం మంత్రి అనిత ▶▶ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -నక్కపల్లి: రాష్ట్రంలో గంజాయి నిర్మూలన కోసం 'ఈగల్ వ్యవస్థ' ను ప్రవేశపెట్టి ఉక్కుపాదం మోపుతున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి తెలిపారు. నక్కపల్లిలో హెటిరో డ్రగ్స్ కంపెనీ రూ. 2.5 కోట్ల రూపాయలు వ్యయంతో సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా ఏర్పాటు చేయనున్న పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణ పనులకు ఆదివారం అనిత భూమి పూజ చేశారు. డిఐజి హరీష్ కుమార్ గుప్తా తో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, నక్కపల్లిలో అన్ని అంగులతోనూ, అత్యాధునిక సౌకర్యాలతో పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందుకు గాను సీఎస్ఆర్ నిధుల కింద 2.5 కోట్లు కేటాయించిన హెటిరో సంస్థ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్డీయే ప్రభుత్వంలో పోలీసు శాఖకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. వచ్చే నెల రోజుల్లోనే పోలీసు విభాగానికి కొత్త వాహనాలు అందజేస్తామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున సీసీటీవీ కెమేరాల ఏర్పాటు జరుగు తోందన్నారు. మహిళలకు భద్రత, భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు. పోలీస్ శాఖలో కూడా వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళల రక్షణ కోసం 'శక్తి యాప్'ను సమర్థవంతంగా ఉపయోగిస్తున్నామన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ విషయంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ 2వ స్థానంలో ఉందని, ఈ స్థానాన్ని మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. డిజిపి హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, నూతన పోలీస్ స్టేషన్ ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యంగా, వేగవంతమైన సేవలను అందించే లక్ష్యంతో నిర్మించబోతున్నామని తెలిపారు. 9 నెలల్లో భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం హెటిరో కంపెనీ ప్రతినిధులు కుల్లాయి రెడ్డి, మూర్తి లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, నర్సీపట్నం డిఎస్పీ పి.శ్రీనివాసరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ ఎం.శ్రావణి, సిఐలు కుమారస్వామి, రామకృష్ణ, అప్పన్న, ఎస్ఐ సన్నిబాబు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత

పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొండెంపూడిలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-వడ్డాది: బుచ్చయ్యపేట మండలం కొండెంపూడి గ్రామంలో ఆదివారం వి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సత్యారావు ఆధ్వర్యంలో సర్పంచ్ ఆది సత్తిబాబు, వార్డ్ నెంబర్ ఆది రవికుమార్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఎన్నారై హాస్పిటల్ వైద్యులు గుండె, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కొండెంపూడి పరిసర ప్రాంత గ్రామాల నుండి ప్రజలు తరలి వచ్చారు. కొండెంపూడి గ్రామస్తులు, నాయకులు వి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్యారావుని అభినందించారు.

యువత స్వశక్తితో ఎదగాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: యువత ఎవరిపైన ఆధారపడకుండా స్వశక్తితో పైకి రావాలని నర్సీపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యచంద్ర కోరారు. ఆదివారం మాధవ నగరంలో జనసేన గ్రామ అధ్యక్షులు గుడివాడ కృష్ణ నూతన టీ టైం, కిరాణా షాప్ ను ఆయన ప్రారంభించారు. చదువుకున్న యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ సమయాన్ని వృధా చేయకుండా ఏదో ఒక వ్యాపారాన్ని ప్రారంభించి కుటుంబాన్ని పోషించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ నాయకులు పోలిపర్తి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు గంటా శ్రీనివాసరావు, ఉల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అల్లూరి సీతారామరాజు పాడేరు ఏజెన్సీ ప్రాంత గిరిజన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు వి.విజయ తెలిపారు. అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్‌లో ఈ ఉచిత బస్సు ఎంతో కీలకమైన పథకమని, అంగరంగ వైభవంగా ప్రారంభించారని తెలిపారు. గిరిజన ప్రాంతంలో అనేక కారణాలు చెబుతూ స్త్రీలకి ఉచిత బస్సు సర్వీసు లేకుండా చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. రాష్ట్రమంతా ఉచిత బస్సు సౌకర్యం ఇచ్చి, కేవలం గిరిజన ప్రాంత మహిళలకి ఉచిత బస్సు కల్పించకపోవడంపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు సౌకర్యం గిరిజన ప్రాంతం మహిళలకు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సులో మహిళలకు టికెట్ తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా జాయింట్ సెక్రెటరీ కె శశికళ, జిల్లా ఉపాధ్యక్షులు కుమారి, జిల్లా కమిటీ సభ్యులు సన్యాసమ్మ పాల్గొన్నారు.

డ్రగ్స్ తయారీ ఫార్మా కంపెనీలపై క్రిమినల్ చర్యలు చేపట్టండి : సిఐటియు

ప్రజాశక్తి- అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో డ్రగ్స్ తయారు చేస్తున్న కంపెనీల యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు సెజ్‌లోని ఒక ఫార్మా కంపెనీలో డ్రగ్స్ తయారు చేస్తున్నారన్న సమాచారంతో రెండు రోజులుగా నిర్వహించిన సోదాల వివరాలను బహిర్గతం చేయాలన్నారు. అనుమతులేకుండా డ్రగ్స్ తయారుచేసిన కంపెనీ లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీల్లో సోదాలు చేసి, అనుమతు లేని మందులు తయారీ దారులు, అందుకు సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు